



మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-నెల్లూరు : కార్పొరేషన్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నగరంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా 3 రోజు సర్వోదయ కళాశాల నుంచి వి.ఆర్.సి సెంటర్ వరకు కార్మికులు వినూత్న రీతిలో శరీరానికి వేప మండలు, ఆకులు కట్టుకొని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. ఇంజనీరింగ్ కార్మికులు గత మూడు రోజుల నుండి సమ్మెలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, మాల కొండయ్య, నరసింహారెడ్డి, లవన్ ఇంజనీరింగ్ కార్మికులు, నేతలు ఎం. శ్రీనివాసులు, కె. బాలు, ముని, మోహన్ కృష్ణ మారుతి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న కార్మికులు

కరేడులో రాజకీయ కుంపటి..?

కరేడు ఓ ప్రజా ఉద్యమం..చిన్న, సన్నకారు రైతులు, గిరిజనులు, దళితులు, కడుపు మంటలోనే పురుడుపోసుకున్న ఈ ఉద్యమం ప్రజాగ్రహంతో ముందుకు సాగుతోంది..రాజకీయాలకతీతంగా అక్కడ ప్రజలు, రైతులు పోరాట బాట పట్టారు. తమకు ఎవరు అండగా ఉంటే వారిని కలుస్తున్నారు. ఇక్కడే కొందరు వ్యక్తులు రాజకీయాలు చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో ఇండోసోల్‌కు బీజం పడింది. ఆరోజు టిడిపి నేతలు దీనిని గట్టిగానే విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇండోసోల్ కంపెనీకి అనుకూలంగా వ్యవహరి స్తుందనే విమర్శలున్నాయి. కందుకూరు ఎంఎల్ఎ రైతులను బుజ్జగించి భూములు ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం రైతులు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇది తమకు ఏమాత్రమూ నచ్చడం లేదంటూ బిసివై పార్టీ నేత బోడే రామచంద్రయాదవ్ ఉద్యమం నుంచి వెనక్కి వెళుతున్నట్లు ప్రకటించారు. కరేడు రైతులు, ప్రజలు న్యాయమై పోరాటానికి మద్దతుగా నిలవాల్సిన రాజకీయ పార్టీలు కుంపట్లు పెడుతున్నాయనే విమర్శలున్నాయి. వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ , ప్రజా సంఘాలు కరేడు ప్రజా పోరాటానికి బాసటగా నిలుస్తున్నారు. ఇదే ఇక్కడ ప్రజల్లో చర్చినీయాంశమైంది. అప్పుడు, ఇప్పుడు ఓట్లు వేసి తమకు తోడుగా ఉంటారని బావించిన వ్యక్తులు, పార్టీలు రాజకీయ అజెండా అమలు చేస్తున్నాయనే అనుమానాలు ఇక్కడ ప్రజల్లో కనిపిస్తోంది.

- ‘జగన్’తో రైతులు భేటి
- రైతులను బుజ్జగిస్తున్న ‘టిడిపి’
- ఉద్యమం నుంచి ‘బోడే’ వెనక్కి
- ప్రజల పక్షాన వామపక్షాలు, కాంగ్రెస్



సిఎం జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కరేడు రైతులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కరేడులో తమ భూములు ఇండోసోల్ పరిశ్రమకు ఇవ్వబోమని, ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని రైతులు, ప్రజలు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి ఇక్కడ ఉద్యమ నివురుగప్పిన నిప్పులా సాగుతోంది. పేదల ఇళ్లు, పచ్చని పొలాలు భూసేకరణలో ఉన్నాయి. గత నెల 29న కరేడు రైతులు, ప్రజలు ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఒక్కసారిగా వేలాదిగా జాతీయ రహదారిపైకి వచ్చి తమ నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటుకు గత వైసిపి ప్రభుత్వంలోనే బీజం పడింది. అప్పట్లో టిడిపి నాయకులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. రైతుల భూములు తీసుకోడానికి, పరిశ్రమ ఏర్పాటుకు తాము వ్యతిరేకమని ప్రకటించారు. ఇప్పుడు సమస్య ముందుకు రావడంతో ఒక్కొక్కరు తమ రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉద్యమం తొలినాళ్ల నుంచి వామపక్షాలు ఇక్కడ ప్రజల పక్షాన నికరంగా నిలబడి పోరాటం చేస్తున్నాయి. విజయవాడ నుంచి 10 వామపక్షపార్టీలు, ప్రజా సంఘాలు కరేడు వచ్చి మద్దతు ప్రకటించాయి. లాయర్లు, యానాది సంఘం, మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రజల కష్ట , సుఖాలు తెలుసుకొని తామున్నామంటూ భరోసా కల్పించారు. ఉద్యమం ఉధృతంగా సాగుతోన్న వేళ కూటమి ప్రభుత్వం రైతులను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తుంది. ఇటీవల ఎంఎల్ఎను కలిసి రైతులతో ఆయన భూములు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. కరేడులో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా పాల్గొన్న ఎంఎల్ఎ కనిపించలేదు. వైసిపి ఎంఎల్‌సి మాధవరావు తాము ముందుటామని ప్రకటించారు. అసలు కారణమే వైసిపి అయినప్పుడు వీరి సహకారంపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాపితంగా ప్రజల దృష్టికి ఆకర్షించిన ఈ ఉద్యమంలో ఎంఎల్ఎ ఇంటూరు నాగేశ్వరరావు ఎవరి పక్షానో అర్థం కావడం లేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల పక్షమా ? కార్పొరేట్ కంపెనీ పక్షమా ? అనే అనుమానం అక్కడ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కరేడు గ్రామానికి వెళ్లని ఆయన సోమవారం ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో బాగంగా టెంకాయ చెట్లపాళెం గ్రామానికి పోలీసుల బందోబస్తు నడుమ వెళ్లారు. కరేడు భూ సమస్య ప్రశ్నించొద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేసినా రైతులు ఆయనను నిలదీశారు. ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తానని ప్రకటించారు. అధికారపార్టీ తమకు అండగా ఉంటుందా అనే అనుమానాలు ఇక్కడ ప్రజల్లో బలంగా ఉన్నాయి. వైసిపి పాత్రపైనా ఇదే అనుమానాలు కొందరు రైతులు వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలు ఏమైనా ప్రజలకు కష్టం వచ్చినప్పుడు వారి పక్కన నిలబడేవారే ప్రజా నాయకులుగా గుర్తింపు పొందుతారు. ఇక్కడ ప్రజా అజెండా కన్నా, రాజకీయ అంజెండానే కనిపిస్తున్నాయి. ప్రజలు మాత్రం తమ ఉద్యమ స్ఫూర్తిని వదలడం లేదు. మా భూములు ఇచ్చే ప్రశ్నే లేదని తెగేసి చెబుతున్నారు...

ప్రజల పక్షమా..కార్పొరేట్ పక్షమా..?

కరేడు భూసేకరణ వ్యవహారంలో కొన్ని రాజకీయ పార్టీల వ్యవహార శైలీపై స్థానిక ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు రాజకీయ పార్టీలతో పనిలేదని, మా ఊరిని, పొలాలను కాపాడుకుంటామని చెబుతున్నారు. మంగళవారం కరేడు రైతులు ప్రతిపక్షనేత వైఎస జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎవరు తమతో కలిసి వస్తే అందరి సహకారం తీసుకోవాల్సిందే. ఉద్యమం తొలిరోజుల్లో ముందున్న బీసివై పార్టీ నేత బోడే రామచంద్రయాదవ్ ఉద్యమం నుంచి వెనక్కి వెళతున్నట్లు ప్రకటించారు. జగన్‌ను రైతులు కలవడమే తప్పుగా ఆయన ఈ ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వం కరేడు ఉద్యమంలో ఎటు వైపు ఇప్పటికీ స్పష్టం చేయలేదు. రైతులు తమ భూములు ఇవ్వమని చెప్పడంతోపాటు, ప్రజాభిప్రాయ సేకరణలోనూ వేలాది మంది అర్జీలు ఇచ్చారు. ఈ ఒక్క సంఘటనతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఆ పనిచేయకుండా రైతుల మధ్య చీలికలు తీసుకురావడానికి, ఏదొక సాకు చూపించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. ఉద్యమం తొలి నాళ్ల నుంచి వాపమక్షాలు కరేడు ప్రజల పక్షాన నిలబడ్డారు. ఇప్పటికే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణతోపాటు పది వామపక్షాలు, ఐలు జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ లాయర్ల టీమ్, మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆరోజు నుంచి ఇప్పటి వరకు అదే నినాదంతో ముందుకు పోతున్నారు. కాంగ్రెస్‌పార్టీ మద్దతు ప్రకటించింది. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలా త్వరలో కరేడులో పర్యటించనున్నారు. రాజకీయాలు ఎన్ని ఉన్నా ప్రజల పక్షాన నిలబడాల్సిందే. కరేడు ప్రజలు ఎవరు ప్రజా పక్షం.. ఎవరు కార్పొరేట్ పక్షమో చర్చిం చుకుంటున్నారు. ప్రజా పోరాటం ఉధృతంగా సాగుతోంది. తమ నిరసనను మరింత గట్టిగా వినిపించడానికి సిద్ధమవుతున్నారు .

కరేడుపై వాలిన గద్దల రెక్కలు విరుస్తాం..

మహిళా సంఘాల ఐక్యవేదిక హెచ్చరిక - బాధిత ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి- ఉలవపాడు

కరేడుపై వాలిన గద్దల రెక్కలు విరుస్తామని, ప్రజలు, రైతులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని రాష్ట్ర మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి అన్నారు. మంగళవారం మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు కరేడు ప్రాంతంలో పర్యటించారు. రైతులు, ప్రజలతో మాట్లాడారు. అక్కడ పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరేడు గ్రామం పచ్చని పంటలతో మంచి వాతావరణంతో 18 వేల మంది జనాభాకి ఉపాధితో కడుపు నింపుతుందని, దాన్ని నాశనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదానికి కట్ట పెట్టాలన్న దుర్మార్గపు ప్రయత్నాలను చాలా బాధాకరం అన్నారు. 8 వేల ఎకరాలు భూమిని రైతుల నుంచి సేకరించి ఇండో సోలో కంపెనీలకు అదాని సంస్థకు లాభాల కోసం కట్టబెట్టడానికి జిఒ నెంబర్ 43 తీసుకొచ్చిందని, . రైతులు అనుమతి లేకుండా చేసే ఈ ప్రయత్నం చాలా దుర్మార్గమని అన్నారు. ఇప్పటికే చాలామందికి ఉపాధి అరకొరా ఉంటే పొలాలు లాగేసుకుంటే రైతులు ఎలా జీవించాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుప యోగంగా ఉన్న స్థలాలు చాలా ఉన్నాయని కాకినాడలో ఎస్‌సిజెడ్‌లో సేకరించిన 10 వేల ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయని అక్కడ పెట్టుకో వచ్చునన్నారు. రాష్ట్రంలో లక్ష ఎకరాలు సేకరించి నిరుపయోగంగా ఉన్నాయని అక్కడా ఇలాంటి పరిశ్రమలు పెట్టుకోవచ్చునని తెలిపారు. ఇక్కడ వేలమందికి బతుకునిస్తున్న భూమిని కొల్లగొట్టడం ప్రజల అభివృద్ధికి కాదని, పెట్టుబడి దారుల లాభాల కోసమేనన్నారు. ఎందుకు అక్కడ కంపెనీ పెట్టట్లేదని ప్రశ్నించారు. గతంలో జగన్ బినామి అన్న షిరిడీ సాయి అని అన్నారు. ఇండోసోల్ కంపెనీలు ఇప్పుడు చంద్రబాబు బినామీ లయ్యాయా? లేక ఆ కంపెనీలకు ఊడిగం తాము చేస్తూ జనం చేత కూడా చేయించడానికా అని ప్రశ్నించారు. వేలు ముద్ర వేయనిది పెన్షన్ ఇవ్వరు. రేషన్ ఇవ్వరు. మరి వారి అనుమతి లేకుండా భూములు,ఇళ్లు తీసుకునే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి, అఖిలభారత మహిళా సమాఖ్య జాతీయ నాయకులు వనజాక్షి, రాష్ట్ర కార్యదర్శి దుర్గ భవాని, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు పద్మశ్రీ, ప్రగతిశీల మహిళా సంఘం పిఒడబ్ల్యురాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు

కరేడు రైతుల అభిప్రాయాలను గౌరవిస్తాం..

ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు పట్టణ టిడిసి కార్యాలయంలో బుధవారం ఉదయం కరేడు పంచాయతీలోని అన్ని గ్రామాల రైతులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. సమావేశానికి రైతుల తోపాటు పలువురు గ్రామస్తులు హాజరయ్యారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాన్ని గౌరవిస్తామని, కరేడు పంచాయతీలోని ప్రతి గ్రామంలో అధికారులతో గ్రావ ఽసభ నిర్వహించి రైతుల అభి ప్రా యాలను సేకరి స్తామని, వారికి ఏమైనా సమస్యలు ఉంటే రాష్ట్ర సిఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంఎల్ఎ రైతులకు హామీ ఇచ్చారు.. కరేడు ప్రాంత రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

ప్రజాధనం వృథా చేస్తారా..

ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

అధికారం ఉందని, మంత్రి పి. నారాయణ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, ప్రజా ధనం వృథా చేయడంతోపాటు, పర్యావరణాన్ని పట్టించుకోవడం లేదని ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో జాఫర్‌సాహెబ్ కాలువ, మైపాడు రోడ్డును అభివృద్ధి చేశారని, మంత్రి అనాలోచిత నిర్ణయంతో ఇక్కడ విధ్వంసం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రూ 100 కోట్లతో కాలువ, రూ.20 కోట్లతో రోడ్డు అధునికీకరణ పనులు చేశారన్నారు.

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు : కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్‌తోపాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ అమెండ్‌మెంట్ బిల్లు పెన్షనర్ల పాలిట గొడ్డలిపెట్టువంటిదని, ఆ బిల్లును వెంటనే రద్దు చేయాలని మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు మేరకు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లోని డిఆర్ఒ జె. ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ ఉద్యమ నేత పి.బాబురెడ్డి మాట్లాడారు. పెన్షనర్ల సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ అధ్యక్షులు ఎస్ఎం గౌస్ మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రమణయ్య, కోశాధికారి జె.హజరత్తయ్య, కార్యనిర్వహణాధికారి సిహెచ్ రఘునాద్, అసోసియేట్ అధ్యక్షులు ఎన్ శ్రీనాథ్, ఉపాధ్యక్షులు ఎస్‌కె ఖాసీం, ఆత్మకూరు శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీరాములు, సుధాకర్, బుచ్చి శాఖ అధ్యక్షులు మాల్యాద్రి, వింజమూరు శాఖ అధ్యక్షులు సుధాకర్, పొదలకూరు శాఖ అధ్యక్షులు కోటేశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు. జిల్లా ఉపాధ్యక్షులు వి.విరేంద్రనాథ్, డి.గోపాల్, గుర్నాదం, ఎం.వి.ఎస్ ప్రసాద్, వెంకటస్వామి ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం

స్వర్ణాంధ్ర విజన్ -2047 లక్ష్యంగా

ముందుకు సాగుదాం : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన “విజన్ 2047” కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కందుకూరు శాసనసభ ఇంటూరి నాగేశ్వరరావు , సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ హాజరయ్యారు. ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు “స్వర్ణాంధ్ర 2047” ప్రణాళికను ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.కందుకూరు నియోజకవర్గం అభివద్ధి కోసం తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -గుడ్లూరు : పోస్టల్ పథకాలని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు పోస్టల్ ఎఎస్‌పి ఆర్ మల్లేశ్వరరావు తెలిపారు. గుడ్లూరు లోని స్థానిక పోస్టల్ కార్యాలయంలో సబ్ పోస్ట్ మాస్టర్ హరికష్ణ ఆధ్వర్యంలో గుడ్లూరు, పెద్దపవని బ్రాంచి పోస్టుమాస్టర్లతో కలిసి ఆయన మంగళవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఇండియన్ పోస్టల్ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసిన ప్రతి వినియోగదారుడుకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు తీసుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. కేవలం 200 రూపాయలు ఖర్చుతో ప్రతి ఒక్కరూ ఖాతా ఓపెన్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో 30 మంది బ్రాంచి పోస్ట్ మాస్టర్లు ఓ సి హెచ్ వెంకటేశ్వర్లు కార్యాలయం సిబ్బంది రికార్డింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని పొట్లూరు సచివాలయంలో ఐదేళ్లపాటు విధులు నిర్వహించి ఇతర మండలాలకు బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందిని అదే గ్రామంలోని నాయకులు వారి సేవలను కొనియాడుతూ మంగళవారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు.పాజెర్ల సర్పంచ్ పాటి.వెంకటేశ్వర్లు. పొట్లూరు టిడిపి నాయకులు .పాతలపల్లి శ్రీనివాసరాజు. కార్యనిర్వహకులు. వెంకటేశ్వర రాజు. ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె రహంతుల్లా.ఉప సర్పంచ్ పులిపాటి ఈశ్వరయ్య. సిహెచ్ శ్రీనివాసరాజు. రామరాజు. డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీ లత. రోసి రాజు ఉన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం.. అనే నినాదంతో మేక్ ఏ చేంజ్ సొసైటీ కందుకూరు వారి సహకారంతో కందుకూరు పట్టణం విజయనగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్,నోటు పుస్తకములు,బోధనా సామగ్రిని మంగళవారం అందజేశారు. సిఆర్‌పి రమణారెడ్డి హాజరై మాట్లాడారు.

మా ప్రాణాలైనా వదులుతాం..భూములను వదలం..

జగన్‌కు తెగేసి చెప్పిన కరేడు గ్రామ రైతులు

ప్రజాశక్తి-కందుకూరు

కూటమి ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగించిన ఒక్క సెంటు భూమి కూడా వదులుకోబోమని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ధైర్యంతోనే మా పోరాటాన్ని ఉధృతం చేసి భూములను నిలబెట్టుకుంటామని ఉలవపాడు మండలం కరేడు భూబాధితులు చెప్పారు. సస్యశ్యామల సాగు భూములు, రైతు కూలీలకు వ్యవసాయ పనులు, మత్స్యకార కుటుంబాలకు మత్స్యసంపద స్థిరమైన జీవనోపాధితో కళకళలాడుతూ పాడిపంటలతో నిత్యం తులతూగే కరేడు ప్రాంత భూములను వదులుకొని పోవడం అంటే మా ప్రాణాలను వదిలివేయటమేనని కరేడు ప్రాంత రైతులు మంగళవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రివర్యులు, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చి ఆవేదన వెళ్లబుచ్చారు. సమంజసమైన కరేడు ప్రాంత రైతులకు పూర్తి సంఫీభావాన్ని ప్రకటించి రైతులు పక్షాన నిలబడాలని జగన్మోహన్ రెడ్డికి వినతి పత్రం ద్వారా కోరారు. రెండుకారుల పంటతో కరేడు చుట్టుపక్కల ప్రాంతాల భూముల్లో వేరుశనగ అన్ని రకాల కూరగాయలు జామాయిలునారు, సవకనారు, మామిడి, కొబ్బరి,జామ తోటలు, సముద్రంపై ఆధారపడి బతికే మత్స్యకార కుటుంబాలు బతికే వేలాదిమంది జీవితాల్లో మంటలు రేపుతున్నారని కరేడు రైతులు చెప్పారు. సావధానంగా రైతులు బాధను విన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మన రైతులకు సంపూర్ణ మద్దతు తెలియ జేస్తున్నాను. మీ భూముల పై మీకే పూర్తి హక్కు ఉంటుందని ప్రజాభిప్రాయానికి, రైతుల అభిప్రాయానికి భిన్నంగా భూములు సేకరించడం సరికాదన్నారు. ఇండో సోల్ ప్రాజెక్టుకు నా ప్రభుత్వం చేవూరు ప్రాంతంలో భూములు కేటాయించిందని పని కూడా మొదలుపెట్టారు. దానిని కాదని కరేడు ప్రాంతంలో భూములు ఇవ్వడం కూటమి ప్రభుత్వం దురుద్దేశం బయటపెడుతుందని అన్నారు. బిపిసిఎల్ ప్రాజెక్టుకు భూములు కావాల్సి ఉంటే ప్రభుత్వ భూములను కేటాయించాలని సూచించారు.ప్రకాశం, నెల్లూరు జిల్లాల వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు అండగా ఉంటారని రైతులకు మనోధైర్యం చెప్పారు. మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ కరేడు గ్రామపంచాయతీలో ఒక్క ఎకరా భూమి తీసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒప్పుకోదన్నారు. పచ్చని పొలాలను చంద్రబాబు నాయుడు బలవంతంగా లాక్కుంటున్నాడని దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తూ కరేడు ఉద్యమాన్ని బలపరుస్తున్నామని అన్నారు. జగన్ ను కలిసిన వారిలోఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, కరేడు గ్రామ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు సీతారెడ్డి, రైతు నాయకులు మిరియం శ్రీనివాసులు, రైతు ప్రతినిధులు దగ్గుమాటి సుబ్బరామిరెడ్డి, కొక్కిలగడ్డ కృష్ణారావు, తెడ్డు శ్రీనివాసుల రెడ్డి, సవరం పెద్ద వెంకట్రావు, పీతా రమణయ్య, నల్లపరెడ్డి సుధాకర్ రెడ్డి, కేశవరపు జాలి రెడ్డి, పోకూరి వినయ్, పీతా రామకృష్ణ, బొమ్మిరెడ్డి శరభా రెడ్డి, వీరేపల్లి పదారెడ్డి, జెడ్‌పిటిసి ప్రతినిధి శ్రీనివాసమూర్తి, డోలా సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ బుర్రా మధుసూదన్ యాదవ్

పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించొద్దు

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం నగర పాలక సంస్థలో 9వ వార్డు పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో సంతపేటలోని పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద నుండి కుక్కలగుంట, కోటమిట్ట మీదుగా పెద్ద బజార్ సెంటర్ వరకు భారీ నిరసన, ర్యాలీ కార్యక్రమాన్ని మంగళవారం తెల్లవారుజామున నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు,సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, నగర నాయకులు కాయంబు శ్రీనివాసులు ప్రసంగించారు.రాష్ట్రంలో తొలి అడుగులో భాగంగా కూటమి ప్రభుత్వం కార్మికుల కడుపు కొట్టి నెల్లూరు నగరపాలక సంస్థ 9వ వార్డు పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. దీనివల్ల కాంట్రాక్టర్ల కింద కార్మికులు బానిసగా మారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తక్షణమే టెండర్లను రద్దు చేయాలన్నారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, నాయకులు షేక్ ఫయాజ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం అశోక్,లోకేష్,మనోజ్, రమేష్ రాంబాబు, రాజేంద్ర,చంద్రమ్మ శ్రీనివాసులు, జ్యోతి, మేరీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం

బొల్లినేని సెంటర్లో నిరసన

రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్ పరిధిలోని పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించరాదని డిమాండ్ చేస్తూ కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో బొల్లినేని సెంటర్ నందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుజాతమ్మ, దేశమూర్తి మాట్లాడారు. సి సిఐటి నాయకులు ఎం. మాలకొండయ్య, వెంకట్రావు, ఇందిరా, రవి, బుజ్జమ్మ ఉన్నారు.

మజ్జిగ పంపిణీ


ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో తన సేవా కార్యక్రమాలతో చిరపరిచితులైన సురేష్ రెడ్డి (చికెన్ సెంటర్) అధినేత మార్కెట్ సెంటర్ లో ఏర్పాటు చేసిన చలివేంద్రం నందు ప్రజలకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ, అరటి పండ్లను అందించి తన దాతత్వాన్ని మరోసారి చాటుకున్నారు. సురేష్ రెడ్డి ఆత్మీయులు, మిత్రులు దొండపాడు కు చెందిన కందుకూరు మండల తెలుగుదేశం అధ్యక్షుడు బుస్సారెడ్డి కష్ణ రెడ్డి ముఖ్య అతిథి గా పాల్గొనడం జరిగింది..సురేష్ రెడ్డితో పాటు ఆయన కుమారుడు మోహన్ కిషోర్ రెడ్డి, స్నేహితులు, అభిమానులు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.



భూములకు హద్దులు చూపాలి : వ్య.కా.సం

ప్రజాశక్తి-కందుకూరు

వలేటివారిపాలెం మండలంలోని రామలింగాపురం గ్రామంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో కందుకూరు ప్రాంత దళితులకు ఇచ్చిన 470 ఎకరాల ప్రభుత్వ భూములను రీ సర్వే జరిపి అర్హులైన, సాగుదారులైన వారందరికీ పొజిషన్ చూపించాలని, ఆ భూముల పై హక్కులు కల్పించాలని మంగళవారం కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి. జాన్ అధ్యక్షత వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం 270 ఎకరాలను 42 మంది దళితులకు అప్పటి ప్రభుత్వం అసైన్మెంట్ భూమిని ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, కొద్దిమందికి పట్టాలు కూడా మంజూరు చేసిందన్నారు. కానీ భూమి పొజిషన్ చూపించలేదన్నారు. . దళితులు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా అదిగో ఇదిగో అంటూ వాయిదా వేస్తూ నేటికి పొజిషన్ చూపకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని రీ సర్వే జరిపి, గతంలో ఎవరికైతే అసైన్మెంట్ పట్టాలు ఇచ్చారో వారికి హద్దులు చూపించాలని కోరారు. ధర్నాకు మద్దతుగా సామాజిక కార్యకర్తలు పాలేటి కోటేశ్వరరావు, డి సి హెచ్ మాలకొండయ్య, బి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఆర్ మోహన్ మాట్లాడారు. సబ్ కలెక్టర్‌కి వినతి పత్రంఅందజేశారు. భూమి లబ్ధిదారులు దేవరకొండ. ఆదిలక్ష్మి, జే. సతీష్ కుమార్, మహేష్ బాబు, కిషోర్ బాబు, నక్క గంగాధర్, దారా వెంకటేశ్వర్లు, శ్యామల, శైలజ, మాల్యాద్రి, కె అగస్త్య, భాను ప్రసాద్, మంగమ్మ పాల్గొన్నారు.



సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

కరేడులో భూసేకరణ ఆపండి

కాంగ్రెస్ పార్టీ నిరసన దీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఒ పక్క వన మహోత్సవాలని నీతులు చెబుతూ మరో పక్క పచ్చని పొలాలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం అన్యాయమని, రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ఖండిస్తూ కరేడు భూ సేకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందని నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కె.సంజయ్ కుమార్ అన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలా పిలుప మేరకు నెల్లూరు పట్టణంలోని విఆర్‌సి సెంటర్ లో కరేడు రైతుల అక్రమ భూసేకరణకు వ్యతిరేకంగా, జారీ చేసిన 43 జీఓను వెంటనే ఉపసంహ రించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు.



అజయ్‌కుమార్ మద్దతు

మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ పాల్గొని కార్పొరేట్ సంస్థలకు భూమిని కట్టబెట్టి గిరిజనుల, రైతుల పొట్టకొట్టొద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. కరేడు రైతులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నారపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.రూరల్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ఓబీసీ చైర్మన్ సిరివెళ్ల నరేష్ మాట్లాడుతూ గ్రామ సభకు పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు తెలియజేసిన వ్యతిరేకతను గుర్తించాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, హనీఫ్, సేవాదళ్ సుజాత, షేక్ ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ : డ్రెయిన్ కాలువలలో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందిని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశిం చారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 42వ డివిజన్ మన్సూర్ నగర్, పరమేశ్వరి నగర్ ప్రాంతాలలో స్థానిక టిడిపి నాయకులు సయ్యద్ ఇంతియాజ్ తో కలిసి కమిషనర్ పర్యటించారు. రామిరెడ్డి కాలువను పరిశీలించారు. పూడిక తీత పనులను, సిల్ట్ ఎత్తివేత కార్యక్రమాలను చేపట్టి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం 46, 42వ డివిజన్ డివిజన్లలో పర్యటించారు.

నిరుపయోగంగా ‘ఎటిఎం’

అవస్థల్లో వినియోగదారులు

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరులో కెనరా బ్యాంక్ ఆవరణంలో ఉన్న ఎటిఎం గత నెలరోజులుగా పనిచేయడం లేదు. దీంతో ఎటిఎం వినియోగదారులు ఇబ్బందుల పడుతున్నారు. బ్యాంకు లో నేరుగా నగదువిత్ డ్రా చేసుకోవాలంటే గంటలు తరబడి క్యూలో నిల్చోవాల్సి వస్తుందని వాపోతున్నారు. దీనిపై పలువురు మేనేజర్‌ను సంప్రదించారు సమస్య పరిష్కారానికి బ్యాంకు ఉన్నతాధికారులకు తెలిపినట్లు కెనరా బ్యాంకు మేనేజర్ మీరావాలి తెలిపారు, నూతన మిషన్ వెంటనే బిగించి వినియోగదారుల అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.



ఆరోగ్య కేంద్రాలలో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని పిసినాయుడు వీధి, జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతాలల్లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ ఆకస్మిక తనిఖీలు చేశారు. ల్యాబ్‌ల్లోని పలు రికార్డులను పరిశీలించారు.పిసినాయుడు స్ట్రీట్ మహిళా ఆరోగ్య పర్యవేక్షకులు కరుణమ్మ ఉన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-నెల్లూరు : వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలందించడమే విద్యుత్తు సంస్థ ప్రధాన లక్ష్యమని ఎస్ఈ వి.విజయన్ అన్నారు. మంగళవారం ఆయన విద్యుత్తు భవన్‌లోని తన ఛాంబర్ నుంచి జిల్లాలోని ఇంజనీరింగ్ అధికారులతో, అకౌంట్ విభాగం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి. మురళీ పాల్గొన్నారు.

రీసర్వేను నిర్వహించాలి

ప్రజాశక్తి - ఉదయగిరి : మండలంలోని అన్ని పంచాయతీల్లో రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ ఎల్.రామ్మోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో విఆర్ఒలు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీసర్వే నిర్వహించే క్రమంలో రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. పలు సమస్యలపై వచ్చే ప్రజలకు సత్వర పరిష్కారానికి చర్యలు చూపెట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షాజియా, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పంచాయతీ మార్కెట్‌లో వేలం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి గ్రామ పంచాయతీలోని మార్కెట్‌లోని షాపుల వద్ద నగదు వసూలు చేసేందుకు మంగళవారం అధికారులు వేళం నిర్వహించారు. గ్రామపంచాయతీలో బహిరంగ వేలం పాటలో షేక్ ఫైజుల్లా, షేక్ ఆబిద్, షేక్ అలీ ముగ్గురు వేలం దారులు పాల్గొన్నారు. ఈ బహిరంగ వేలం పాటలో షేక్.ఫైజుల్లా 2 లక్షల 50 వేల రూపాయలకు పాటపాడి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ కరీముల్లా మాట్లాడుతూ ఈ బహిరంగ వేలం పాటను గ్రామ సర్పంచ్ పాములూరు సామ్రాజ్యం, ఎంపిడిఒ ఎ.అప్పాజీ సమక్షంలో వేలాన్ని ప్రారంభించామన్నారు. అందులో భాగంగా ప్రయివేటు వాహనాల రోజువారి వసూలు, కూరగాయల మార్కెట్ రోజువారి వసూలు, మాంసం మార్కెట్ రోజువారి వసూలును షేక్.ఫైజుల్లా తండ్రి భాషా, మోదిన్ 2,50,000 హెచ్చు వేలం పాటతో దక్కించుకున్నారు.

స్కిల్‌డే ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా విద్యార్థులకు ఒకేషనల్ ఉపాధ్యాయులైన గొల్లపాటి ఎజ్రా, నాగం వెంకటేశ్వర్లు డ్రాయింగ్ పోటీలు, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు స్కిల్ డే ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.అనంతలక్ష్మి ఒకేషనల్ విద్య, స్కిల్‌డే విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. తోటి ఉపాధ్యాయులైన బిసి పెంచలయ్య, మాధవరావు పాల్గొన్నారు. అనంతరం పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామంలో జరిగిన పోలేరమ్మ తల్లి గ్రామ పొంగళ్ల కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మంగళవారం పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు పలువురు ఇళ్లకు వెళ్లి, మాటామంతి కలిపారు. దాదాపు డెబ్బై ఏళ్ల క్రితం తిరునాళ్ళు జరిగాయని, పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయని తెలిపారు. పోలేరమ్మ తల్లి తిరునాళ్ళను ప్రతి సంవత్సరం పండుగ వాతావరణంలో ప్రశాంతంగా చేసుకుంటూ అమ్మ ఆశీస్సులు పొందుతూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చింతం బాబుల్ రెడ్డి, సురే శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్.సి.సి. విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కావలి : శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల, వి.ఆర్ నగర్‌లో 10 ఆంధ్ర నావెల్ యూనిట్, నెల్లూరు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ బాలాజీ గోదగవే ఆదేశాల మేరకు పి.ఇస్టాఫ్, పి.లక్ష్మీనారాయణ, ఎస్.వి రమణ విద్యార్థులలో ఎన్.సి.సి నావల్ విభాగంలో 50మందిని వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు, ఎన్.సి.సి. థర్డ్ ఆఫీసర్ టి.కొండారెడ్డి పాఠశాలలో ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో బాగుపడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫహీముద్దిన్, వై.రజనీ, బి.సరళ, భాగ్యమ్మ, సుజన, వాసవి, జనార్దనరెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపాలి..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : క్రమం తప్పకుండా ప్రతినిత్యం తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని ఎంఇఒ పివి రత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం ఖాజా నగర్‌లోని ఎంపి యూఎస్, ఉర్దూ పాఠశాలలో 1వ తరగతి నుండి, 5వ తరగతి వరకు చదువుతున్న 100మంది పిల్లలకు సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం నోట్ బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి పివి రత్నం పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు జిలాని భాషా, పిఆర్ పి.మల్లేశ్వర రెడ్డి, చైర్మన్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జుగుప్సాకర వ్యాఖ్యలే ప్రసన్న నైజం..

ప్రజాశక్తి-కోవూరు : ఎదుటివారిని జుగుప్సాకరంగా మాట్లాడడం మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నైజం అనితెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి విమర్శించారు. కోవూరులోని తన కార్యాలయం ఏర్పాటు చేసిన పత్రికా విలేఖర్ల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇటీవల ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై సభ్య సమాజం తలదంచుకునేలా మాట్లాడి, మళ్లీ ఆయన మాట్లాడిన దానిని సమర్ధించుకుంటూ తనను పెర్సెంటేజీలో ప్రసన్న అన్నందుకే ఆమెపై ఆ విధమైన విమర్శలు చేశానని తెలిపడం దారుణమన్నారు. కోవూరు ఎంఎల్‌ఏగా గత ఏడాదిగా ప్రశాంతి రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో కోవూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ఆమెకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రసన్నకుమార్ రెడ్డి ఆమెపై వ్యక్తిగత విమర్శలకు దిగారని ఎద్దేవా చేశారు. మాజీ ఎంపిపి గిద్దలూరు ఉమ, టిడిపి నాయకులు కలికి సత్యనారాయణ రెడ్డి, వెలగపూడి శ్రీనివాసులు, ఇంటూరు విజయ్, వీరంశెట్టి మధు, ఇందుపూరు మురళీకృష్ణ రెడ్డి, వెలగపూడి శ్రీనివాసులు, ఎస్‌కె.మహ్మద్, కుక్కంటి గోపాల్, మరుబోయిన వెంకటేశ్వర్లు, దువ్వూరు రంగారెడ్డి, గోగ్రిపాటి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన

ప్రజాశక్తి-కోవూరు : ఈవిఎంల ద్వారా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాదిగా రాక్షస పాలన సాగిస్తోందని కోవూరు నియోజకవర్గం మైనారిటీ సెల్ నాయకులు అన్నారు. కోవూరు వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు గత పది రోజులక్రితం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నివాసం టిడిపికి చెందిన కొందరు నాయకులు వారి అనుచర గణంతో దాడి చేసి ఇంట్లో ఉన్న ప్రతిఒక్కటి విచక్షనా రహితంగా ప్రవర్తించి ఇంటిని ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎక్కడా ఇలాంటి దాడులు జరగలేదన్నారు. మారణాయుధాలతో వచ్చిన టిడిపి గూండాలు ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో ఉంటే హతమార్చేవారని అందరికీ తెలుసన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు, ఇళ్లపై దాడులు చేసుకుని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మండల కన్వీనర్ అనూప్ రెడ్డి, వైస్ ఎంపిపి నరశింహులు రెడ్డి, మైనారిటీ నాయకులు గయాజ్, షాహుల్, కరిముల్ల, ధవులత్, నయీం, జుబేర్ తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

ప్రజాశక్తి-బిట్రగుంట : వైసిపి పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని కావలి వైసిపి, ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బాబు షూరిటీ – మోసం గ్యారెటీ కార్యక్రమం వైసిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. బోగోలు సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి రాజశేఖర్ రెడ్డి పూలమాల వేసి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు, జెడ్‌పిటిసి కీర్తన, ఎంపిపి మేకల సుజాత, జిల్లా అధికార ప్రతినిధి మేకల శ్రీను, జెడ్‌పిటిసి పద్మమ్మ, సుందర్ రాజ్, తోటపల్లి సాగర్, జనార్దన్ రెడ్డి, రమేష్ రెడ్డి, కళ్యాణ్, వేణు,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కామరాజు, నిర్మల్ ,వరుణ్, పర్రి అంకుల్ అయ్య, సాల్మన్ రాజ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని పటిష్టంగా అమలు చేయాలి



ప్రజాశక్తి-కావలి : ఉపాధి హామీ పథకాన్ని కావలి డివిజన్‌లో పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ మంగళవారం వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ, గ్రామాలలో గిరిజనులకు జాబ్ కార్డులివ్వాలన్నారు. 200 రోజులు పనులు కల్పించి పేదలను ఆదుకోవాలన్నారు. పని ప్రదేశాలలో వసతులు కల్పించి, ఉపాధి పనికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్.డి.ఒ. కార్యాలయ గుమస్తా సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కావలి మండల అధ్యక్షులు పి. సీతారామయ్య, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.జాన్, డి.కమలాకర్, ఎస్.మధు. పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-సంగం : ఎంపిడిఒ కార్యాలయంలో అన్నారెడ్డిపాలెం గ్రామస్తులు తమ గ్రామంలో డ్రెయినేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్పెషల్ ఆఫీసర్ రమేష్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మురుగునీటి వల్ల దోమల బెడదతో అవస్థలు పడుతున్నామన్నారు. అనారోగ్యాల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోయారు. సచివాలయం అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్‌కు రూ.21వేలు వేతనమివ్వాలి




కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జిఒ నెంబర్ 36 ప్రకారం మున్సిపల్ కార్మికులకు ఇచ్చే రూ.21 వేల వేతనాన్ని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగులు జులై 12వ తేదీ నుండి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. అందులోభాగంగా మున్సిపల్ వర్కర్స్, ఇంజనీరింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలియజేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ డిమాండ్లను వివరించారు. జిఒ నెంబర్ 36 ప్రకారం మున్సిపల్ కార్మికులకు ఇచ్చే రూ.21వేల వేతనం ఇంజనీరింగ్ కార్మికులకు ఇవ్వాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వయోపరిమితి పదవి విరమణ 60 సంవత్సరాల నుండి 62కు పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికుల అందరికీ ప్రభుత్వం అందించే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం సమ్మె జరుగుతుందని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులు వీధిలైట్లు, వాటర్ సప్లై, పబ్లిక్ హెల్త్ విభాగాలలో ఇంజనీరింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. సమ్మె జరుగుతున్న కారణంగా పట్టణ ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఈ పరిస్థితులో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చొరవ తీసుకొని మున్సిపల్ సంఘం నాయకులతో చర్చలు జరిపి వెంటనే పరిష్కరించాలన్నారు. తద్వారా ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వారి సమస్యను పరిష్కరించాల ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఇంజనీరింగ్ కార్మికుల చేస్తున్న సమ్మెకు 16వ తేదీలోపు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో అర్ధరాత్రి 12 గంటల నుండి ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెలో పాల్గొంటారని ప్రభుత్వానికి తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యద ర్శులు కొండమూరి హజరత్తయ్య, ఆత్మకూరు నాగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురవయ్య, చెన్నకేశవులు, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

మురళి సేవలు మరువరానివి

ప్రజాశక్తి ఇందుకూరుపేట



మాట్లాడుతున్న టివివి ప్రసాద్

నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు, నగర కార్యదర్శి పిడుగు మురళి సంతాప సభను మండలంలోని పల్లిపాడు గ్రామం సిపిఎం కార్యాలయంలో పల్లెపాడు ఆటో స్టాండ్ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా ఆటోకార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, నెల్లూరు నగర సిఐటియు కార్యదర్శి జి.నాగేశ్వరరావు, జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజాలు పాల్గొని పిడుగు మురళి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పిడుగు మురళి హఠాత్ మరణం చాలా బాధాకరమన్నారు. మురళి నెల్లూరు నగరంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేసేవారని ఆయనకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కార్మికుల సంక్షేమం కోసం ఊపిరి ఉన్నంతవరకు పని చేశారన్నారు. ఆటో కార్మిక సంఘం విస్తరణకు ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఆటో కార్మికులందరినీ ఏకతాటిపై నడిపించేందుకు ఆయన చేసిన కృషి చేశారన్నారు. అటువంటి నాయకుడు కోల్పోవడం ఆటో కార్మికులందరికీ, వారి కుటుంబానికి తీరనిలోటని మురళి మృతికి చింతిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర హరి, మనోహర్, దయాసాగర్, ఎన్‌టిఆర్ నగర్ స్టాండ్ కార్యదర్శి రవీంద్ర, రమేష్, సందీప్, పల్లెపాడు స్టాండ్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ శ్రీనివాసులు, లక్ష్మీపతి, చైతన్య, స్టాండ్ సభ్యులు, బర్రె ప్రసాద్, శ్యామ్‌రెడ్డి, ఆటో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-కావలి :



సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మికులు 17వ తేదీ నుండి సమ్మెలోకి వెళ తున్నట్లు మంగళవారం కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ జి.శ్రావణ్ కుమార్‌కు సమ్మెనోటీసు అందజేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గతసమ్మెకాలం ఒప్పందాలను అమలు చేయాలని కోరుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనెఫిట్ 62 సంవత్సరాల వయస్సు పరిమితి పెట్టారని, ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని సమస్యల పరిష్కారం కోసం 17వ తేదీ నుండి సిఐటియు అనుబంధం మున్సిపల్ కార్మికులు సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.శీనయ్య, బి.మహేష్, ఒ.రమేష్ మహిళ నాయకులు పి.చిన్నమ్మ, పి.అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు..

ప్రజాశక్తి-కోవూరు :



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం లేకుండా ఎప్పటికప్పుడు వాటిని నిష్టంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. కోవూరు అన్ని తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్ సుబ్బయ్యకు విఆర్ఒలకు పలు సూచనలు చేశారు.

మహిళా కమిషన్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కావలి : సమాజంలో స్త్రీలు మహిళా కమిషన్‌పై అవగాహన పెంచుకొని రక్షణ పొందాలని కావలి లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి పేర్కొన్నారు. ప్రముఖ సంఘసంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని అరుంధతిపాలెం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణంలో ఆమె స్ఫూర్తితో మహిళా కమిషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలత, సిహెచ్ విజయ్ కుమారి, మహిళలు పిల్లలు పాల్గొన్నారు.

రేషనలైజేషన్‌పై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఓట్ల రేషనలైజేషన్‌పై బూత్ లెవల్ అధికారులు దృష్టి సారించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీ నాయకులు బిఎల్‌ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పోలింగ్ బూత్‌లో 1200 ఓట్లు దాటితే 2వ పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సూచించారు. 16న సీతారాంపురం, 17న ఉదయగిరిలో బిఎల్‌ఒలకు శిక్షణా సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మరికొన్ని అంశాలపై శిక్షణ ఉంటుందని ప్రతిఒక్కరూ తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.రామ్మోహన్, రాజకీయ నాయకులు బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

క్రాస్ రెగ్యులేటర్ పరిశీలన

ప్రజాశక్తి-సంగం : సంగంలోని కనిగిరి రిజర్వాయర్ క్రాస్ రెగ్యులేటర్‌ను సోమశిల ఎస్ఇ రమణారెడ్డి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, డిఇ పెంచలయ్య పరిశీలించారు. కనిగిరి రిజర్వాయర్‌కు నీటి విడుదలపై అధికారులతో చర్చించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈస్టర్న్ ఛానల్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ బత్తల హరికృష్ణ, ఎఇ వినయ్, రైతులు పాల్గొన్నారు.

ప్రసన్నపై హైకోర్టు సీరియస్..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : మహిళా ఎంఎల్‌ఎపై ఆ వ్యాఖ్యలు ఏమిటని మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని హైకోర్టు తప్పుబట్టింది. మహిళా ఎంఎల్‌ఎకు ఇచ్చే గౌరవం ఇదేనా.. అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించలేమని తెలిపింది. కోవూరు టీడీపీ ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన నల్లపరెడ్డిని హైకోర్టు మందలించింది. అనుచిత వ్యాఖ్యలు చేయకుండా నియంత్రణలో ఉండాలని ఆదేశించింది. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హైకోర్టు హెచ్చరించింది. మీ వ్యాఖ్యలతో న్యూసెన్స్ చేశారని హైకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఏపీ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

ప్రపంచ యువజన నైపుణ్యదినోత్సవం

ప్రజాశక్తి-మర్రిపాడు :



మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో సెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా మేర భారత్ యూత్ అధికారి ఎ.మహేంద్ర రెడ్డి పాల్గొ ని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, జనరల్ నాలెడ్జ్ ప్రశ్నోత్తరాలు నిర్వహించగా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను, మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యార్థులకు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణకు మేరా యువభారత్ మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో నైపుణ్య అభివృద్ధి, ఆత్మవిశ్వాసం వంటి విలువలను పెంపొందించేందుకు ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాగాల శ్రీహరి, నెహ్రూ యువభారత్ ఆత్మకూర్ క్లబ్ ప్రెసిడెంట్ జె.ప్రభుకుమార్, కళాశాల అధ్యాపకులు పి.వేణు, సిహెచ్ వెంగమ్మ, జిల్లా సిఎసిఎల్ క్లబ్ అబ్జర్వర్ నారాయణ, మేర యువభారత్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమారి, కవిత పాల్గొన్నారు.

బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గ అసెంబ్లీ పరిధిలోని 37మంది బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ సురేష్ బాబు, ఎలక్షన్ నిర్వహణ సహాయకులు రమణయ్య పాల్గొన్నారు.

అల్లూరులో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-అల్లూరు



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, జెసి

అల్లూరు మండలంలో మంగళవారం కలెక్టర్ ఒ.ఆనంద్ విస్తృతంగా పర్యటించారు. అందులో భాగంగా తొలుత అల్లూరు-2 లోని నాగులదేవిగుంట వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న కాలువ పూడిక తీత పనుల సునిసితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ రైతు కూలీలతో ముచ్చటిస్తూ ఎన్ని పని దినాలు పూర్తి చేశారు.. ఎంత వేతనం పొందారు.. అదేవిధంగా ఉపాధి హామీ పనులు కాకుండా వేరే పనులు ఏమైనా చేస్తున్నారా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డులు పొందని వారు తక్షణమే ఆధార్ కార్డులు పొంది ప్రభుత్వం అందిస్తున్న గృహ వసతిని పొందాలని సూచించారు. అనంతరం రామకృష్ణ డిగ్రీ కాలేజీలో నైపుణ్యత శిక్షణ అభివృద్ధి ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి లబ్ధిదారులకు తగు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన దయాకర్ రెడ్డి హౌసింగ్ లేఅవుట్‌లో తనిఖీ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి లబ్ధిదారులు నివసించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్లాబ్ వరకు వచ్చిన ఇళ్ళను వెంటనే పూర్తి చేయాలన్నారు. స్థానికులు మాట్లాడుతూ నీటి వసతి లేనందున పూర్తయిన గృహాలలో లబ్ధిదారులు ఇంకా చేరలేదని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. తక్షణమే దానిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నీటి వసతి లభించేలా సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం బిసి సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. మరుగుదొడ్లను, విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. పిదప విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. స్థానికులు మరుగుదొడ్ల ద్వారా వచ్చే వ్యర్థమైన నీరు వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. దానిపై స్పందించిన జిల్లా కలెక్టర్ తక్షణమే మురుగనీరు సమస్యను పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారి రజినీకాంత్‌కు సూచించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో కాలువల పూడిక తీత పనులు ఉపాధిహామి పథకం ద్వారా చేపట్టడం జరిగిందన్నారు. రైతులు వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు ముగ్గు చూపాలని రైతు సాధికార సంస్థలతో పనులు చేయాలని ఆయన సూచించారు. కాలువలు వడ్డున చెట్లను నాటించి పచ్చదనం పెంపొందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నైపుణ్యత శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలకు ఉపాధి కల్పించే విధంగా బ్యాంకు నుండి రుణాలు పొదుపు సంఘాల నుంచి మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని అదేవిధంగా మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. బిసి సంక్షేమ వసతి గృహంలో వసతులు బాగున్నాయని 100శాతం అడ్మిషన్లు పూర్తిచేసేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటివరకు సంక్షేమ వసతి గృహాలలో 95శాతం అడ్మిషన్లు జరిగాయన్నారు. జిల్లాలో అన్ని వసతి గృహాలలో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు చేపట్టడానికి తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వెనుకబడిన తరగతుల వసతి గృహంలో ఇస్తున్న భోజనం బాగుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి వంశీ కృష్ణ, మండల రెవెన్యూ అధికారి లక్ష్మీ నారాయణ, మండలాభివృద్ధి అధికారి రజినీకాంత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.